18 ఏండ్లు నిండినవారు
ఓటు హక్కు వినియోగించుకోవాలి
కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

వాకర్లతో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 23 : 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న రాశి వనంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో మతాలకతీతంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు వేయడం ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులు, వాకర్ అసోసియేషన్ ప్రతినిధులతో సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్, జిల్లా అధికారులు రాజారాం, వరదారెడ్డి, వెంకట్ రెడ్డి, సాయిలు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లింగం, బాలయ్య, శంకర్, రాజ్‌గంభీర్‌రావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు ఓటు వేయాలి

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ట్రాన్స్‌జెండర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో సుమారు 30 మందికిపైగా ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ నెల 25 న ఓటరు తుది జాబితా విడుదల చేస్తామని, మే 13న జరిగే పోలింగ్‌లో వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మీడియా సర్టిఫికేషన్,మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనఖీ చేశారు. జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమాధికారి బావయ్య, స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- పాల్వంచ వాగు నుంచి ఇసుక తరలింపు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు
- మండలంలో యథేచ్ఛగా మొరం తవ్వకాలు

మెండుగా అధికారుల అండదండలు

బండరామేశ్వర్‌పల్లి శివారులో ఇసుక డంపులు

మాచారెడ్డి, ఏప్రిల్ 23 : మాచారెడ్డి, పాల్వంచ మండలాలు అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా మారుతున్నాయి. పాల్వంచ వాగు పరీవాహక గ్రామాలైన ఆరెపల్లి, భవానీ పేట, పాల్వంచ, వాడి, బండరామేశ్వర్‌పల్లి, మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామాలు అక్రమ రవాణాకు అడ్డాగా మారుతున్నాయి. అక్రమార్కులు అధికారుల అండదండలతో ఇసుక మాఫియా టిప్పర్, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తూ రెచ్చిపోతున్నారు.

విచ్చలవిడిగా ఇసుక డంపులు

వాగు పరీవాహక ప్రాంతం పాల్వంచ, మాచారెడ్డి రెండు మండలాల్లో ఉన్నది. అక్రమార్కులు ఆయా గ్రామాల్లో ఇసుక మాఫియా ముఠాగా ఏర్పడి రాత్రి పూట జేసీబీ సహాయంతో అక్రమంగా ఇసుకను తవ్వి టిప్పర్లలో లోడ్ చేసి యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు.

ఫిర్యాదు చేసేవారి వివరాలు బహిర్గతం

అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచడంలేదు. ఇందుకు భిన్నంగా మాచారెడ్డి, పాల్వంచ తహసీల్దార్లు వారి పేర్లను బహిర్గతం చేస్తూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారికి చేరవేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం బండరామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాచారెడ్డి ఎస్సైకి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరికి డయల్ 100కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మాచారెడ్డి తహసీల్దార్‌కు ప్రత్యేకంగా వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆ వ్యక్తి వివరాలను బహిర్గతం చేయడంతో ఆయనను ఇసుక మాఫియా బెదిరింపులకు గురి చేసిందని సమాచారం.

తూతూ మంత్రంగా తనిఖీలు

ఉమ్మడి మాచారెడ్డి మండలం నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పోలీస్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ తూ తూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు కనీసం ట్రాక్టర్లు, టిప్పర్లను ఆపిన దాఖలాలు లేవు. అధికారులు, ఇసుక మాఫియా కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచ్చల విడిగా మొరం తవ్వకాలు

మండలంలోని ప్రతి గ్రామంలో అక్రమంగా జేసీబీల సహాయంతో మొరం తవ్వకాలు చేపడుతున్నారు. లక్ష్మీరావుల పల్లి గ్రామశివారులోని కామారెడ్డి–సిరిసిల్ల రహదారిని ఆనుకొని ఉన్న స్థలంలో జేసీబీ సహాయంతో మొరం తవ్వి టిప్పర్ల ద్వారా తరలించడంపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారు. ఉమ్మడి మాచారెడ్డి మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా, మొరం తవ్వకాలు చేపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

ఇసుకను తరలించేందుకు అనుమతులు లేవు

పాల్వంచ వాగు పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఇసుకను తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవు. పట్టుబడితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు భారీ జరిమానా విధిస్తాం.

-శ్వేత, తహసీల్దార్, మాచారెడ్డి

ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

ఇప్పటి వరకు 13 ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని వాటిని సీజ్ చేశాం. మాచారెడ్డి, పాల్వంచ తహసీల్దార్లకు అప్పగించాం. ఇసుకను తరలించడానికి అనుమతులు లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై, మాచారెడ్డి

బోరు మోటరు బిగింపు

బీబీపేట్, ఏప్రిల్ 23 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ ఆధ్వర్యంలో నీటి సమస్యను పరిష్కరించడానికి మంగళవారం బోరు మోటరు బిగించారు. 'నమస్తే తెలంగాణ'లో 'స్పెషల్ ఆఫీసర్లు ఎక్కడా' అనే శీర్షికన కథనం సోమవారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి బోరుమోటరును బిగించారు. బీబీపేట పెద్ద చెరువు సమీపంలో మాందాపూర్ గ్రామ శివారులో బోరు మోటరు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాందాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బోరు మోటరు

వైద్య శిబిరానికి స్పందన

గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్యులు

డోంగ్లీ, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ టెస్టులతోపాటు కంటి, దంత పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు.. ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డోంగ్లీ వైద్యాధికారిణి శ్రీలేఖ, డాక్టర్లు బస్వరాజ్, విక్రమ్, సిబ్బంది పండరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 23: లింగంపేట్ మండలం ఐలాపూర్ గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం పర్యటించారు. మాజీ మంత్రి బాలాగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

బీమా చెక్కును అందజేస్తున్న ఎంపీడీవో సవితారెడ్డి

రామారెడ్డి, ఏప్రిల్ 23: మండలంలోని మోషంపూర్ గ్రామానికిచెందిన భూంపల్లి రవికి మంజూరైన పోస్టల్ ప్రమాద బీమా చెక్కును ఎంపీడీవో సవితారెడ్డి రామారెడ్డి రైతువేదికలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే పలు రకాల బీమా పాలసీలను పోస్టాఫీస్ అందిస్తున్నదని అన్నారు. ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలని సూచించారు. రవి మూడు నెలల క్రితం ప్రమాదానికి గురికావడంతో దవాఖానలో ఖర్చుల నిమిత్తం 77వేల రూపాయల బీమా మంజూరైందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తపాలా అధికారి పవన్‌రెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, రామారెడ్డి పోస్టల్ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా కాకుండా చర్యలు

గాంధారి, ఏప్రిల్ 23: తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. ఆయన మంగళవారం ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డితో కలిసి మండలంలోని మాతుసంగెం గ్రామంలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్లను పరిశీలించారు. బోరు మోటర్ల వద్ద నీరు వృథా కాకుండా రింగులతో ట్యాంకులను నిర్మించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మోటర్ల వద్ద లీకవుతున్న నీరు ట్యాంకులో చేరి నిల్వ ఉంటుందని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ కూడా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రోజా తదితరులు ఉన్నారు.

ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక

మద్నూర్, ఏప్రిల్ 23: మండలకేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మాండ్లు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా నగేశ్, కమిటీ సభ్యులుగా అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యవర్గ సభ్యులకు భక్తులు శాలువాలు కప్పి సన్మానించారు.

వేసవి సెలవులు షురూ..

హాస్టల్ నుంచి ఇండ్లకు వెళ్తున్న విద్యార్థులు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 23: పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. మంగళవారం విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేశారు. బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. దీంతో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు పెట్టె సర్దుకొని ఉత్సాహంగా ఇండ్లకు బయల్దేరి వెళ్లారు. బస్టాండ్లు విద్యార్థులతో కిటకిటలాడాయి.

బాలికపై యువకుడి లైంగికదాడి.. కేసు నమోదు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 23 : మండలంలోని ఓ గ్రామంలో బాలిక(16)పై యువకుడు లైంగికదాడి పాల్పడ్డాడు. దీంతో సదరు 21 ఏండ్ల యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు.

వైద్యుడిపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

బాన్సువాడ, ఏప్రిల్ 23 : బాన్సువాడలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా దవాఖానలో వైద్యం కోసం వచ్చిన రోగితో అనుచితంగా ప్రవర్తించిన వైద్యుడిపై రోగి కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. రోగితో అనుచితంగా మాట్లాడడంతో పాటు ట్రీట్‌మెంట్ పరీక్షల పేపర్లను చింపివేయడంతో రోగి తరపు బంధువులు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని దవాఖాన సూపరింటెండెంట్‌ను కోరారు.

ధాన్యం తూకం వేసిన వెంటనే
రైస్‌మిల్లులకు తరలించాలి
అదనపు కలెక్టర్ చంద్రమోహన్

పాల్వంచలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మాచారెడ్డి,ఏప్రిల్ 23 : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. పాల్వంచ మండల కేంద్రం తోపాటు వేల్పుగొండ, వాడి, మాచారెడ్డి మండల కేంద్రంలో ఉన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం తూకం వేసిన వెంటనే జాప్యం లేకుండా సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటిని కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి, ఏప్రిల్ 23 : రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన తెడ్డు అనిత అనే వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ నుంచి బీబీపేట్‌కు పసిరికలకు మందు తాగివస్తానని మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిందన్నారు. ఆ తర్వాత కామారెడ్డి బస్టాండ్‌లో ఆటో దిగిన తర్వాత నుంచి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదన్నారు. భర్త బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I SUGANDA YANDALA (Old Name) D/o. Yandala Satyanarayana, H.No. 1-4-1118 PN YS Residency, Road No.8, Presidency Avenue, Pet Basheerbad, Jeedimetla, Medchal- Malkajgiri Dist., Telangana 500067, Hence Changed my name as SUGANDA YENDALA (New Name) D/o. Yandala Satyanarayana

NTZ-5984

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.

NT-311831-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

బాన్సువాడలో భక్తులతో కలిసి భజన చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడలో హనుమాన్ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి ఉత్సవాలను కామారెడ్డితోపాటు జిల్లావ్యాప్తంగా మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్ని హనుమాన్ ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. బాన్సువాడలోని పెద్ద హనుమాన్ ఆలయంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో పాల్గొని తబలా వాయించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న పోచారం భక్తులతో కలిసి భోజనం చేశారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే వేర్వేరుగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయగా.. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి, పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్, బిచ్కుందలోని హనుమాన్ ఆలయాల్లో నిర్వహించిన జయంత్యుత్సవాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. బిచ్కుంద లోని హనుమాన్ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని పూజలు చేశారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన శోభాయాత్రలో ఎంపీ పాటిల్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ పాల్గొన్నారు.

రామారెడ్డిలో హనుమాన్ శోభాయాత్ర భక్తులకు నిమ్మరసం పంపిణీ చేస్తున్న ముస్లింలు

సలాబత్‌పూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

మద్నూర్ మండలం సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


బీబీపేట్ మండలం మాందాపూర్, భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో నిర్వహించిన ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

– బీబీపేట్/భిక్కనూరు, ఏప్రిల్ 23 :

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 23 : పట్టణంలోని ఆక్స్‌ఫోర్డ్ గ్రామర్ పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రావీణ్యం కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి తరగతిలో ఉత్తమ ప్రతిభ, క్రీడల్లో నైపుణ్యం కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌ను మున్సిపల్ చైర్మన్ అందజేశారు. ప్రిన్సిపాల్ లావణ్య, కౌన్సిలర్ వెంకటేశ్, పాఠశాల నిర్వాహకుడు నరేశ్, ఉపాధ్యాయులు సవిత, పద్మ, సునిత, శ్వేత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.